# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

*(తెలుగులో చాటు కవిత్వం ..... అంటే, కేవలం చాటు పద్య సంకలనము మాత్రం కాదు. వాటిని శీర్షీకరించి ఆకర్షణీయంగా నలుగురికీ తెలియజేయాలనే నా ప్రయత్నాన్ని 'కౌముది' పాఠకలోకం ఆదరిస్తుందనే అనుకుంటున్నాను. ముందుగా చాటు కవిత్వం అంటే నిర్వచించుకుందాం)*

చాటు కవిత అనునది కవిచేత అప్పుడప్పుడూ ఆశువుగా చెప్పబడేది. గ్రంధస్థము కానిది. అందు చేత చాటు కవిత ప్రత్యేక ప్రయోజనమాశించి చెప్పబడును అని నిర్ధారించుట కష్టము. రాజుల గురించి, రాజమంత్రుల గురించి, నీతి శృంగార, హాస్యాదివివిధ విషయముల గురించి కవులు గావించిన ప్రసంగములు చాటువులుగా ప్రాచుర్యమునంది పల్లెలోను, పట్టణములలోను, సాహితీపిపాసకులైన ముదుసళ్ళ పలుకుబడులలోనూ తాండవమాడుచు, చెవియొగ్గి వినునప్పుడు విచిత్రానుభూతిని కలిగించక మానవు. ప్రాచీన చాటువులలో చాలా వరకు అవి ఎవరిచే రచింపబడినవో తెలుపుట కష్టం. కొన్ని చాటవులు శైలిని బట్టి, మరికొంత లోక వాడుకను బట్టి కవి ఎవరో ఊహించుటకు వీలు కలిగించాయి.

తెలుగు భాష తీరుతెన్నుల తీయదనము, ప్రౌఢకవుల కవితారీతి, ఒక్కొక చోట ప్రబంధ కవులను మించిన భావనా పటిమ తనలో నిముడ్చుకుని 'చాటుకవిత' మబ్బు మసకేసిన చందమామవలె తెనుగు సాహిత్యమునందు చోటు చేసుకునే ఉందనుట సత్యదూరము కాదు. ఆదరణ లేక శిష్టుల అటకలపై చెదపురుగుల దురాగ్రహానికి బలై ఎన్నో అమూల్య గ్రంధాలు కాలగర్భంలో లీనమైనట్లే చాటు కవిత కూడా ఈ దురవస్థకు లోను కాక తప్పలేదు. నామరూపాలు లేకుండగ పోగా, మిగిలిన చాటవులు ఎట్లో ఆ నోటా ఆ నోటా పడి రూపాంతరము చెందినను బ్రతికి బట్ట కట్ట ప్రయత్నించుటకు వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వంటి పండిత ప్రకాండులు జరిపిన కృషి మెచ్చదగినది.

తెలుగువారి అదృష్టమేమోకానీ పేరెన్నిక గన్న అమూల్య గ్రంధములెన్నియో కాలగర్భంలో రూపుమాసిపోయినవి. అయినను ఆ మహాకవుల వాణి ఆ చంద్రార్కమై జనులలో నిలిచి యుండుట వలననో లేక నిజంగానే ఆ గ్రంధములను చూచియుండుటవలననో లక్షణ గ్రంధ కర్తలు వారి వారి పద్యములను ఉదహరించి కనీసం గ్రంధనామములైనా తెలుసుకొనుటకాస్కారము కలిగించారు. సాధారణముగా లోకములో ప్రజలలో ప్రచారములో నున్న ప్రముఖ గ్రంధములలోని పద్యములు లక్షణ కర్తలు గ్రంధస్థము చేసి ఉండాలి. ఈ లక్షణగ్రంధములలో చాటుగా తొంగిచూచుచున్న మధుర కవితావశేషములు పరిశీలించి మరుగుపడిన గ్రంధములు, కవులు కూడా ఒకచోట కూర్చబడినపుడు చాటు కవిత పరమార్థము సిద్ధిస్తుంది. చాటు అనగా తొంగి చూచు అనునది సాధారణ అర్థము. ఉదాహరణ అని కూడా చాటువున కర్థమున్నది.

నీతి శృంగారహాస్యాది వివిధ విషయముల గురించి గానీ లేదా వీటిని మిళితము చేసి తమ ఎడల ఆదరానాదరాలు చూపిన ప్రభువులపైన, ధనాధికుల గురించి, దుష్ప్రభువుల అక్రమపరిపాలనము గురించి, లేక దురాత్మల దుండగపు కార్యక్రమములగురించి కవులు ప్రయోగించిన పద్యరాజములు, అసూయచే సాటి పండితులను హేళన చేయుచు చెప్పబడిన పద్యములు --- చాటుకవితకు ప్రాణము వంటివి.

ఒక సంఘటన కానీ లేక ఒక మహామహుని చరిత్ర కానీ గర్భములో విచిత్ర మార్పులకు లోనై అది నిజమని భ్రమింపచేసి బుద్ధిమంతులను సహితము వాదోపవాదములకు దింపి ప్రచారమైన కథా చాటవులు--- సజీవములై చాటుకవితలో అంతర్భాగములవుతున్నాయి. కష్టసుఖాల జీవన పరిధిలో భక్త్యావేశముతో భగవంతుని గుణగణములు కీర్తించుచునో లేక నిందించుచునో కవులు చాటు కవితలో తొంగి చూడక మానరు. ఏది ఏమైనా చాటవులు సాధారణముగా అల్పాక్షరముల అనల్పార్థాన్ని సాధించి ఆహ్లాదముతో పాటు మనసుకు సూటిగా నాటుకుంటాయి.

## *అధ్యాయం-1*

## *చాటవులు - వివిధవిషయములు*

***లోకనీతి:-***

కూటికోసము కోటివిద్యలు.పాండిత్యము కూడా కూటికోసమే! పాండిత్యమున్న వానికెక్కడైనా జరుగుబాటు ఉంటుంది. సరిఅయిన ఆదరణ లభిస్తే అది ప్రకాశిస్తుంది. లేనినాడది వ్యర్థమవుతుంది. అంతేకాదు పండితుడాశ్రయించునపుడు సరసుడైన వానిని మాత్రమే ఆశ్రయించాలన్నది చాటకవుల చాటు పద్యాలలోనిక్షిప్తమైన లోకనీతి ఎప్పటికీ సజీవమే!

పొట్ట చీరిస్తే అక్షరం.. ముక్క లేదని, అక్షరమ్ముక్క నోట్లో ఉన్న వాడికి ఎక్కడైనా జరుగుబాటుంటుందని అంటుంటాము. అక్షరము లోక రక్షితమని చెప్పుచూ ఈ చాటువు

*అక్షరంబు వలయు కుక్షిజీవనులకు*
*అక్షరంబు జిహ్వ కిక్షురసము*
*అక్షరంబు తన్ను రక్షించుగావున*
*అక్షరంబు లోక రక్షితంబు*

అని అక్షరాస్యత ఆవశ్యకతను తెలియచేసింది.

కేవలము పాండిత్యమున్నంత మాత్రాన సరిపోదు. ఆపాండిత్యం జగత్పూజ్య ప్రతాపోదయశ్రీకి కారణం కావాలి. పండితునకే కాదు, ఎటువంటి గొప్పవారికైనను సరే జగత్పూజ్యప్రతాపోదయశ్రీకి విఘ్నములు కలిగించే ఆరుకారణాలను ఈ క్రింది చాటువు వివరిస్తోంది.

*ఆలస్యంబుని, కామినీ జనరతాత్యాశక్తియున్, జన్మభూ*
*లోలత్వంబును, రోగపుంభయము, దుర్లోభంబు, సంతోషమున్*
*బోలంగానివి యారునెప్పుడు, జగత్పూజ్యప్రతాపోదయ*
*శ్రీలంజెందగ విఘ్నకారణములై చెల్లున్ ధరామండలిన్*

ఎంత పాండిత్యమున్నప్పటికినీ, ఆదరణ లేని చోట గవ్వ విలువ చేయదు. రాజాదరణ పొందిన భటాళి భటత్వము, వైద్యుని వైద్యము, కవికవితామహత్త్వము, గాయకుని గానము మాత్రమే -- కోటి విలువ చేస్తున్నాయి. ప్రతిభావంతమైన యువత నిరాదరణకు గురవుతున్న నేటి పరిస్థితికి కూడా ఈ చాటువు అద్దం పడుతుంది.

*అవనిపుడాదరించిన భటాళి భటత్వము, వైద్యువైద్యమున్*
*కవికవితామహత్త్వమును, గాయకుగానము కోటిసేయున*
*య్యవనిపుడాదరించని భటాళి భటత్వము, వైద్యువైద్యమున్*
*కవి కవితామహత్త్వమును, గాయకుగానముగవ్వసేయున్!*

అయితే నయనానందకరముగా ఉన్నదని-- వివిధద్విజ (పక్షులకు) శ్రేణికి ఆశ్రయము కదాని, - తుమ్మెదలాసతో అశ్వత్థవృక్షము కడకు ఆస్వాదనక్రియకు పుష్పచయంబుకోరి పోయి భంగపడినట్లే - నిర్ధయుడైన సుందరా కారుని వద్దకు పోయి యాచించడమంటే అంతస్సార, నిస్సారతలెరుగని తనమే అవుతుంది. ఎందుకంటే పదిమంది ఒకని నాశ్రయించి బ్రతికేచోట మనము కోరుకున్న జీవితము లభిస్తున్నది పేరాశకావచ్చుననే లోకనీతికి ఉదాహరణ ఈ పద్యచాటువు.

*నయనానందకరంబనిందితము, నానాసద్ద్విజశ్రేణికా*
*శ్రయమశ్వత్థమహీజమంచుశులాసం చెందియాస్వాదనా*
*క్రియకుంబప్పుచయంబుగోరి చనుమాడ్కిన్ సుందరాకారు ని*
*ర్దయునాసింతురుగాకెఱుంగుదురె అంతస్సారనిస్సారతల్*

అలాగే సరసులు కానివారితో కవిత్వప్రసంగములు చేయడమంటే రాతిబొమ్మతో రమించి సౌఖ్యము పొందాలనుకునే శృంగార చేష్టవంటిదవుతుందని ప్రయోజన శూన్యమని ఈ చాటువు

*సరసులు కాని వారియెడ జాలగనిత్వరసప్రసంగముల్*
*కఱుపుట కంఠశోషణమెకాక రసనతగూర్పనేర్చునే*
*స్మరశరజాల వేదనకుజాలక భ్రాంతినిరాతిబొమ్మతో*
*మఱిరమింపగాదివురు మానవుడేమి సుఖింపగల్గెడిన్*

కంఠశోషణము తప్ప ప్రయోజనశూన్యమని హెచ్చరించింది.

అయిననూ సామర్ధ్యమున్న వ్యక్తి ఏ విధముగానైననూ పేరు తెచ్చుకుంటాడు. అటువంటి ఉత్తముని సామీప్యము వలన పాండితీశూన్యులకు కూడా గౌరవము లభిస్తున్నది. ఒకటి పక్కన ఎన్ని సున్నలు పెట్టినా అంకె విలువమారదు కానీ సున్నాలకు విలువ ఉంటోంది. అంకెవిలువ పెరుగుతోందని అనిపించినా ఒకటి తొలిగిస్తే సున్నలకు విలువలేదు. అలాగే ఒక పండితుడి పక్కన శుంఠలు కూడా రాణించి పండితుడి విలువ పెంచుతారు. ఆపండితుడిని విడిచి బయటకు వచ్చిన రోజున ఆ శుంఠలకు విలవ ఉండదనే లోకజ్ఞతకు అద్దంపడుతుంది ఈక్రింద చాటువు.

*ఆఢ్యుడున్నయప్పుడందఱు పూజ్యులే*
*లెక్కమీద సున్న లెక్కినట్లు*
*అతడు పోవు వెనుకనందఱుపూజ్యులే*
*లెక్క లేక సున్నలేగినట్లు*

సున్నకు అంకెతో ఉన్నపుడేవిలువ. అంకెలేని సున్నకు విలువలేదని పండితుడి సరసన, అపండితుడు కూడా శోభించగలడని ఈ చాటువు గంభీరముగా చాటినది.

అందమయిన స్త్రీ చెఱగు మాసి ఉన్నప్పటికిని అలంకరణ మాటున ఈ విషయము మరుగున పడిపోవునట్లు చేయగలదు. అట్లే ప్రతిభావంతునిలోని చిన్న చిన్న లోపాలు, అతని గౌరవానికి భంగం కలిగించవు. చెఱగుమాయడ మంటే స్త్రీ జీవితంలోని ఇబ్బందికరమైన

మూడురోజులు. అలంకరణతో ఆ విషయాన్ని మరుగుపరచి నలుగురి మధ్య ఇబ్బందిలేకుండ ప్రవర్తించి వెఱుగుమాసిన విషయాన్ని స్ఫురింప చేయని పడతి సౌందర్యమువలె ప్రతిభావంతుని ప్రతిభమాటున అతని బలహీనతలు చర్చకు రాకుండా మరుగున పడతాయి.

*సామర్థ్యమున్నవేళల*
*నేమనుజునకేని నిందలెట్లొదవు? కుసుం*
*బామేలిచీరదాల్చిన*
*భామవెఱుగుమాయుగాక బయలంబడునే!*

ఏతము ఎంత క్రిందకి వంగుతుందో అంతపాతాళమునుండీ నీటిని బయటకు తెచ్చి చిమ్ముతుంది. అలాగే చేతనయినవాడు కార్యసాధనకు అణిగిమణిగి ఉన్నట్లు అనిపించినా అల్పుడని భావించ వద్దంటోంది ఈ చాటువు.

*చేతనగువాడు కార్యము*
*కైతగ్గను వంగుగాక యల్పుండగునా?*
*యేతముచడితావంగున*
*బాతాళము నీరు దెచ్చి బయలంజల్లున్*

ప్రతిభావంతుని ఉనికి ఎక్కడున్నా పాతాళములోని నీరులాచిమ్ముకుని బయటకు చీల్చుకుని వస్తుంది.

## కవుల స్థితి :-

ఆధునిక సాహిత్య దుస్థితికి దర్పణముపడుతుంది ఈ క్రింది చాటువు. ప్రతివారు కవులమని చెప్పుకునే వారిని తలచుకుని ఉత్తమ కవి పడిన ఆవేదన ఇది.

*దేవునాన మున్ను దేశానకొక్కరుండ*
*నిప్పుడూరనూరనింటనింట*
*వేవురార్వురేడ్వురెనమండ్రు తొమ్మండ్రు*
*పదువురైరి కవులు పద్మనాభ!*

పద్దెనిమిదవ శతాబ్దిలో ఆడిదము సూరకవి రేకపల్లి సోమప్ప కవి (కల్లూరి సోమనాధుడు) మీది వైషమ్యముతో చెప్పినది.

అంతియేగాక కవితా లక్షణమెరుగని వాని వద్ద కవిత్వము వినిపించుట వ్యర్థము. వాడికి కవిత్వము వినిపించుటకంటే హరిదాసు అగుట ఉత్తమమని ఒక కవి వాపోతున్నాడు.

*కవితాలక్షణమెరుగని*
*యవివేకికి బద్యమిచ్చి అడుగుట కంటెన్*
*చవిలేగొని దండెగొనుకుని*
*భువిలో హరిదాసుడైన పుణ్యమె దక్కున్*

తరువాత సన్మానము మాట దేవుడెరుగు. తన పాండిత్య ప్రకర్ష కోసము ప్రతికవిత్వమును విమర్శించుటే పనిగా పెట్టుకునే వాళ్ళను తిట్టచ్చు తప్పులేదు. ఇంత ఘాటుగా తిట్టాడంటే సద్విమర్శ పక్కదారి పట్టి ఉండాలి. చూడండి ఈ క్రింద చాటువు.

*నక్కలు బొక్కలు వెతుకును*
*అక్కరతో నూరుబంది యగడిత వెదుకున్*
*కుక్కలుచెప్పులువెదుకున్*
*తక్కిడినాలంజెకొడుకు తప్పే వెదుకున్*

ఇక ఉత్తముడైన లేఖకుడు, వాచకుడు గురించి తాళపత్ర గ్రంధ రచన చేసిన కవులు ప్రతిని చూసి ప్రతి సమానముగా రాయలేకపోతే అది తమపాలిటి దురదృష్టమవుతుందని భావించారు. నిజమే మరి-- భిన్న భిన్న లేఖక ప్రమాదముల వలననే కదా రామాయణ మాహాభారతాది గ్రంధములుభిన్న ప్రతులుగా లభించి నేటి కాలములో వాదోపవాదముల తరువాత పరిష్కర్తలకు సవాలుగా నిలిచాయి.

*తప్పు గురితించి వ్రాయుటుత్తమమె యగును*
*ప్రతిసమానముగా వ్రాయుటతిముదంబు*
*రెండువిడనాడి వ్రాసెడి లేఖకుండు*
*కలుగుటరయంగ కవియభాగ్యంబగాదె!*

ఇక వాచకుల గురించి

*వెనుకకు బోక హుమ్మనక వేసటబొందక బంతి బంతిలో*
*బెనుపకలోపలంబ్రమసి బెగ్గిలకంతయు మున్నెసూచుచున్*
*గనుకొనునక్షరక్రమముకందుదప్పక యేక చిత్తుడై*
*యనుపమభక్తితో చదువునాతని వాచకుడంద్రుసద్బుధుల్*

(వచ్చే నెలలో మరికొన్ని ఆసక్తికరమైన చాటువుల గురించి తెలుసుకుందాం)

